నేటినుంచి
'సర్' ప్రారంభం



● రాష్ట్ర ఎన్నికల అధికారి అర్చన పట్నాయక్

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళవారం నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి అర్చన పట్నాయక్ తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఓటరు జాబితాలో మృతిచెందినవారు, చిరునామా మార్చుకున్నవారి పేర్లు తొలగించలేదు. మరోవైపు అనేక మంది ఓటర్ల పేర్లు పలు నియోజకవర్గాల ఓటర్ జాబితాలో ఉన్నాయి. ఇందువల్ల ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు ప్రకారం ఓటరు జాబితా పరిశీలించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అనే పేరుతో ప్రారంభించనున్న ఈ ప్రక్రియలో నకిలీ ఓటర్లను జాబితా నుండి తొలగించడం, అర్హులను మాత్రమే చేర్చడం జరుగుతుంది. ఆ మేరకు తమిళనాడులోని 234 అసెంబ్లీ నియోజకవర్గాలు, కేంద్రపాలిత రాష్ట్ర పుదుచ్చేరి 30 నియోజకవర్గాల్లో మంగళవారం నుండి ప్రారంభించనున్న సర్ ప్రక్రియ డిసెంబరు 4వ తేదీ వరకు జరుగనుంది. ఓటర్ జాబితా సవరణ పనులను రాజకీయ పార్టీల బూత్ ఏజెంట్ల సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహిస్తారు. అన్నీ పూర్తయ్యాక ముసాయిదా ఓటర్ల జాబితా డిసెంబరు 9న పరిశీలన కోసం విడుదల చేస్తారు. తుది ఓటర్ల జాబితా 2026 ఫిబ్రవరి 27వ తేదీ విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చన పట్నాయక్ తెలిపారు. ఆమె సోమవారం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 2002, 2005 సంవత్సరాల్లో విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం సర్ పనులను పారదర్శకంగా నిర్వహించేలా పోలింగ్ బూత్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 2002, 2005 సంవత్సరాల నాటి ఓటర్ జాబితాలో పేర్లున్నవారి ఇళ్లకు మాత్రమే ఎన్నికల సిబ్బంది వెళ్లి దరఖాస్తు ఫారాలు ఇస్తారని వాటిని వెంటనే పూర్తిచేసి సమర్పించాల్సి వుంటుందన్నారు. అంతేకాకుండా ఆ రెండు సంవత్సరాల ఓటరు జాబితాలో మరణించిన వారి పేర్లుంటే ఆ వివరాలను దరఖాస్తులో చూపించాలని, 18యేళ్లు నిండిన కొత్త ఓటర్లు తమ వయసు ధ్రువీకరణ, చిరునామా పత్రాలను డిసెంబర్ 7నుండి జనవరి 3వ తేదీలోగా ఓటరు జాబితాలో నమోదు చేయించుకోవాలని ఆమె సూచించారు.

కరూర్ ఘటన నేపథ్యంలో...

టీవీకే కార్యాలయంలో సీబీఐ విచారణ

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధ్యక్షుడు విజయ్ పాల్గొన్న కరూర్ రోడ్ షోలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతిచెందిన సంఘటనపై దర్యాప్తు జరుపుతున్న సీబీఐ అధికారులు సోమవారం పనయూర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. విజయ్ ఎన్నికల ప్రచారం కోసం డిజైన్ చేసిన బస్సులో ఉన్న సీసీ ఫుటేజీ పరిశీలించారు. కరూర్ దుర్ఘటనపై ఆ పార్టీ ప్రధాన నిర్వాహకుల నుండి ప్రత్యక్షంగా తొక్కిసలాట చూసినవారు, పార్టీ కార్యకర్తలు కలిపి దాదాపు 306 మందిని సీబీఐ విచారించనుంది. కరూర్ వేలుచ్చామిపురంలో సెప్టెంబర్ 27వ తేదీన విజయ్ రోడ్‌షోలో పాల్గొన్న సందర్భంగా చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది మృతిచెందగా, మరో 40 మంది గాయపడిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ సీబీఐకు అప్పగిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఐపీఎస్ సీనియర్ అధికారి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం గత నెల 17న విచారణ ప్రారంభించింది. శుక్ర, శని, ఆదివారాల్లో కరూర్‌లో ఈ బృందం తన విచారణను వేగవంతం చేసింది. ఇదిలా వుండగా, సోమవారం ఉదయం నగరానికి వచ్చిన సీబీఐ బృందం ఈస్ట్‌కోస్ట్ రోడ్ పనియూర్‌లో ఉన్న టీవీకే కార్యాలయానికి వెళ్లి విచారణ చేపట్టారు. అవసరమైతే పార్టీ నేత విజయ్ వద్ద ఈ బృందం విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

టీవీకేలో 64 జిల్లాలకు నిర్వాహకుల ఎంపిక...

టీవీకేలోని 64 జిల్లాలకు మహిళా, విద్యార్థి, యువజన విభాగాలకు తలా ఒక ఆర్గనైజర్, పదిమంది సహాయ ఆర్గనైజర్లను నియమితులయ్యారు. కరూర్ దుర్ఘటన అనంతరం నెల రోజుల తర్వాత ఆ పార్టీ నేత విజయ్ మౌనం వీడారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సౌలభ్యం కోసం పార్టీ పరంగా ఏర్పాటు చేసిన 64 జిల్లాల్లో చురుగ్గా పనిచేసే యువతను ఎంపిక చేసి బాధ్యత అప్పగించారు. మరోవైపు 28 మందితో కూడిన పోలింగ్ బూత్ కమిటీలను ఆయన నియమించి వారితో దశలవారీగా సమావేశం కానున్నారు. కార్యకర్తల విభాగం నిర్వాహకులకు ఇంటింటికి వెళ్లి చేపట్టాల్సిన విధులు, ఓటర్లను ఆయా ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు సాగనండం తదితర అంశాలపై రిటైర్డ్ పోలీస్ అధికారులతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు టీవీకే వర్గాలు తెలిపాయి.

ఇక్కడ ఆ మాట అనే
ధైర్యం ఉందా?

● ప్రధానికి సీఎం స్టాలిన్ సవాల్



ఎంపీ కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న సీఎం స్టాలిన్, మంత్రులు, డీపీఐ నేత తిరుమావళవన్ తదితరులు

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా బిహార్ ప్రచార సభల్లో ప్రధాని మోదీ డీఎంకే శ్రేణులపై చేసిన ఆరోపణలను తమిళనాడు గడ్డపై అనగలరా? అని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రధాని నరేంద్రమోదీకి సవాల్ విసిరారు. ఇటీవల బిహార్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. బిహార్ కార్మికులపై డీఎంకే శ్రేణులు దాడి చేసి చిత్రహింసలకు గురిచేస్తున్నారంటూ రెండు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టేలా ఆరోపణలు చేశారని, బిహార్‌లో బీజేపీ కూటమి ఓట్లు దండుకోవటానికే ఈ వ్యాఖ్యలు చేశారని స్టాలిన్ ఆరోపించారు. ధర్మపురి జిల్లా పెన్నాగరంలో సోమవారం ఉదయం జరిగిన ఎంపీ ఎ.మణి కుమారుడు బహదీశ్వరన్ వివాహవేడుకల్లో సీఎం పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అడ్డదారిలో గెలిచేందుకు బీజేపీ పాలకులు కేంద్ర ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర విచారణ (సర్)లో అక్రమాలు బయటపడినవెంటనే మొట్టమొదటగా తీవ్రంగా వ్యతిరేకించిది డీఎంకే ప్రభుత్వమేనని తెలిపారు. సర్ పేరుతో ఓటర్ల హక్కు వారించే ప్రయత్నాలను అన్ని పార్టీలు సమైక్యంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో సర్ నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరుతూ ప్రత్యేక తీర్మానం చేశామని, రాష్ట్రంలో సర్ ప్రక్రియ ఆపకుంటే సుప్రీంకోర్టులో అఖిలపక్షం తరఫున పిటిషన్ వేస్తామని ప్రకటించినట్లుగానే సుప్రీంకోర్టును ఆశ్రయించామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు న్యాయబద్ధంగా జరపాలని అన్ని పార్టీలూ కోరుకుంటున్నాయని ఆయన తెలిపారు. నకిలీ ఓటర్లకు బదులుగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు చెందిన ఓటర్లను తొలగించేందుకే ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్నారని ఆరోపించారు. ఈ సవరణను వ్యతిరేకిస్తూ జరిపిన అఖిలపక్ష సమావేశానికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ గైర్హాజరవడం గర్హనీయమని, బీజేపీ పాలకులకు భయపడే ఆయన 'సర్'కు మద్దతు ప్రకటించారని పేర్కొన్నారు. తమిళ ప్రజలు ఎల్లప్పుడు ఉపాధి కోసం వచ్చే రాష్ట్రేతర కార్మికులను, యువకులను సాదరంగా ఆహ్వానిస్తారరే తప్ప, వారిపై కక్ష పెట్టుకోరని తెలిపారు. వాస్తవాలు ఇలా ఉంటే ప్రధాని మోదీ బిహార్ ఎన్నికల సభలో బిహార్ కార్మికులను డీఎంకే నేతలు హింసిస్తున్నారంటూ అసత్య ఆరోపణలు చేయడం భావ్యమేనా అని స్టాలిన్ ప్రశ్నించారు.

సభలు, రోడ్‌షోల విధివిధానాల రూపకల్పనకై
6న అఖిలపక్షం

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ పార్టీల ప్రచార సభలు, రోడ్‌షోలను ఎలాంటి దుర్ఘటనలకు తావులేకుండా జరుపుకునేలా కొత్త విధి విధానాలను రూపొందించటానికి ఈ నెల 6న శాసనసభలో, పార్లమెంట్‌లో సభ్యత్వం కలిగిన పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం ప్రకటించారు. కరూర్‌లో సెప్టెంబర్ 27 రాత్రి టీవీకే నేత విజయ్ నిర్వహించిన రోడ్‌షోలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందిన విషయం విధితమే. ఇకపై ఇలాంటి దుర్ఘటనలు జరుగకుండా ఉండేందుకు ప్రభుత్వం నూతన విధివిధానాలను రూపొందించనున్నట్లు ప్రకటించింది. ఈ విషయమై పార్టీల అభిప్రాయాలను తెలుసుకునే నిమిత్తం ఈ నెల 6వ తేదీ ఉదయం 10.30 గంటలకు సచివాలయం పక్కనే ఉన్న నామక్కల్ కవింజరై మాళిగైలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. సీనియర్ మంత్రుల సమక్షంలో ఈ అఖిల పక్ష సమావేశం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రకటించారు. ఆ మేరకు శాసనసభ, పార్లమెంట్‌లో సభ్యత్వం కలిగిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. ఇప్పటికే రాజకీయ పార్టీల నేతలకు ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు.

మహిళా క్రికెట్ జట్టుకు
సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు

అడయార్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత మహిళా క్రికెట్ జట్టుకు ముఖ్యమంత్రి స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ముంబైలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత మహిళా క్రికెట్ జట్టు విజయంపై సీఎం స్టాలిన్ తన ఎక్స్ పేజీలో... 'మన మహిళా జట్టు ఐసీసీ మహిళా ఛాంపియన్ షిప్ గెలిచి, భారత క్రికెట్‌ను మరోసారి ప్రపంచస్థాయికి తీసుకెళ్లింది. ఈ అద్భుతమైన విజయానికి భారత జట్టుకు హృదయపూర్వక అభినందనలు. ఈ విజయం యువ క్రీడాకారిణులను మరింత ప్రోత్సహిస్తోంది' అంటూ సీఎం ట్వీట్ చేశారు. కాగా, భారత మహిళా క్రికెట్ జట్టుకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సహా పలు పార్టీల నేతలు వేర్వేరుగా శుభాకాంక్షలు తెలిపారు.

డీఎంకే పాలనలో
మహిళలకు రక్షణ లేదు

● మాజీ సీఎం, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ఎడప్పాడి పళనిస్వామి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఈపీఎస్

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ద్రావిడ మోడల్ పాలనలో మహిళలకు స్వేచ్ఛలేదని, పాలకులు అబలల సంక్షేమాన్ని విస్మరించారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం అన్నాడీఎంకేలోని అన్ని అనుబంధ విభాగాల నిర్వాహకులకు వేర్వేరుగా ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆ పార్టీలో సమాచార సాంకేతిక విభాగానికి చెందిన 234 నియోజకవర్గాల నిర్వాహకులతో ఆదివారం ఈపీఎస్ సమావేశమయ్యారు. ఈ సమావేశం రెండో రోజైన సోమవారం కూడా రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో జరిగింది. ఇందులో సేలం టౌన్, కృష్ణగిరి ఈస్ట్, కృష్ణగిరి వెస్ట్ తదితర జిల్లాల్లోని ఐటీ నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ జిల్లాల్లో పార్టీ తరఫున నిర్వహించాల్సిన ఎన్నికల ప్రచారం తదితర అంశాలపై ఈపీఎస్ వారికి మెళకువలు నేర్పారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్లు కేపీ మునిస్వామి, దిండుగల్ శ్రీనివాసన్, నత్తం విశ్వనాథన్, ఎస్పీ వేలుమణి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ, కోవై విమానాశ్రయం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఓ యువతిని ముగ్గురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని, ఈ సంఘటన రాష్ట్రప్రజలను ఆందోళనకు గురిచేసిందని తెలిపారు. మహిళలపై ప్రతిరోజు ఇలాంటి అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని, ఈ ఘోరాన్ని అడ్డుకోవాల్సిన మహిళా పోలీసులు ఏమైయ్యారని ఈపీఎస్ ప్రశ్నించారు. స్టాలిన్ ప్రభుత్వం మహిళల భద్రతను తుంగలో తొక్కిందని, అత్యాచార నిందితులను అరెస్ట్ చేసి వారిని కఠినంగా శిక్షించాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.

తంజావూరు యువకుడు.. జర్మన్ యువతి
తమిళ సంప్రదాయంలో వివాహం

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన తమిళ యువకుడిని ఓ జర్మన్ యువతి తమిళ సంప్రదాయం ప్రకారం తంజావూరులో వివాహం చేసుకుంది. తంజావూరు భూతలూరు కూడంపట్టి గ్రామానికి చెందిన విఘ్నేశ్వరన్ జర్మన్‌కు చెందిన యువతి విలినా బెర్గన్ ఆ దేశంలోని ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వారి మధ్య ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇద్దరూ వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.



వధువు నుదుట తిలకం దిద్దుతున్న విఘ్నేశ్వరన్

ఇరువైపు బంధువులు వీరి ప్రేమవివాహానికి పచ్చజెండా ఊపారు. దీంతో తంజావూరులో సోమవారం ఉదయం వీరి వివాహం తమిళ సంప్రదాయ పద్ధతిలో జరిగింది. ఈ వివాహ వేడుకలకు జర్మన్ నుంచి వచ్చిన వధువు తరపు బంధువులు కూడా తమిళ సంప్రదాయం ప్రకారం పట్టుచీరలు, పట్టు ధోవతులు, చొక్కాలు ధరించి హాజరు కావడం విశేషం.



నాగపట్టినంలోని తమిళనాడు డాక్టర్ జె.జయలలిత మత్స్య విశ్వవిద్యాలయ దశమ స్నాతకోత్సవంలో ఛాన్సలర్ హోదాలో విద్యార్థులకు పట్టా ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి.

వీధికుక్కల వ్యవహారం...
సుప్రీంకోర్టుకు
హాజరైన సీఎస్

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల నియంత్రణకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు మందలించిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం సోమవారం కోర్టులో హాజరయ్యారు. ఆ సమయంలో, ప్రమాణ పత్రం దాఖలులో నెలకొన్న జాప్యానికి, తమిళనాడు సహా పలు రాష్ట్రాల కార్యదర్శులు న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణ చెప్పారు. వీధికుక్కల నియంత్రణకు తగిన మార్గదర్శకాలు రూపొందించడంపై అఫిడవిట్ దాఖలుచేయని పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా కేంద్ర పాలిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు నవంబరు 3వ తేది నేరుగా హాజరుకావాలని, గత నెల 27న సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా, వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కల్పించాలని ప్రధాన కార్యదర్శుల అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ క్రమంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, వీధికుక్కల నియంత్రణకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టులో సోమవారం హాజరై రాష్ట్ర ప్రభుత్వం తరపున అఫిడవిట్ దాఖలుచేశారు. అనంతరం అన్ని రాష్ట్రాల అఫిడవిట్లు పరిశీలించి, ఏకీకృత మెమోరాండంగా సమర్పించాలని న్యాయవాది గౌరవ్ అగర్వాల్‌ను న్యాయమూర్తులు ఆదేశించారు. అలాగే, వీధికుక్కల నియంత్రణకు రాష్ట్రాలు తీసుకున్న చర్యలు పరిశీలించిన అనంతరం, అదనపు ఉత్తర్వులు జారీ చేస్తామని, కొత్త ఉత్తర్వులు వచ్చేంత వరకు పాత ఉత్తర్వులు కొనసాగుతాయని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ, తదుపరి విచారణ ఈ నెల 7వ తేదీకి వాయిదా వేశారు.

గందరగోళంగా అఖిలపక్ష సమావేశం

● 'సర్' పై ఇరుపక్షాల పరస్పరారోపణలు
● అన్నాడీఎంకే నుంచి ఎక్కువమందా ? : డీఎంకే
● అందరూ సహకరించాలని కమిషనర్ వినతి

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ రిప్పన్‌భవనంలో సోమవారం ఉదయం చెన్నై జిల్లా ఎన్నికల అధికారి, జీసీసీ కమిషనర్ కుమారగురుబరన్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డీఎంకే తరఫున న్యాయవాది చంద్రూ, అన్నాడీఎంకే తరఫున బాలగంగా, విరుగై వీఎన్ రవి, టి.నగర్ సత్యా, ఆర్ఎస్ రాజేష్, కాంగ్రెస్ తరఫున నవాజ్, బీజేపీ ప్రతినిధిగా కరాటే త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం కాగానే ఒక్కో రాజకీయ పార్టీ తరఫున ఇద్దరు ప్రతినిధులు మాత్రమే పాల్గొనాల్సి ఉండగా అన్నాడీఎంకే తరఫున పాల్గొనేందుకు నలుగురిని ఎలా అనుమతించారంటూ ఎన్నికల అధికారి కుమారగురుబరన్‌ను డీఎంకే ప్రతినిధులు ప్రశ్నించారు. ఆ సందర్భంగా నలుగురు అన్నాడీఎంకే ప్రతినిధులు అఖిలపక్ష సమావేశానికి కనీసం ఇద్దరు చొప్పున హాజరుకావచ్చన్నారని, కనుక ఎంతమంది పాల్గొనాలనే విషయంపై ఎలాంటి ఆంక్షలు లేవని కమిషనర్‌తో గొడవకు దిగారు. చివరకు సమావేశంలో ప్రతి పార్టీ తరఫున ఇద్దరు మాత్రమే పాల్గొంటున్నారని, కనుక అన్నాడీఎంకే తరఫున ఇద్దరు మాత్రమే పాల్గొంటే బాగుంటుందని ఎన్నికల అధికారి నచ్చజెప్పడంతో మిగిలిన ఇద్దరు సమావేశం నుండి బయటకు వెళ్లారు. బాలగంగా, టి. నగర్ సత్యా మాత్రమే సమావేశంలో పాల్గొన్నారు. మంగళవారం నుండి నగరమంతా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రారంభమవుతుందని, అన్ని పార్టీలవారు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. సీపీఎం ప్రతినిధి జి సెల్వా మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ సవరణ చేయడం అనుమానం కలిగిస్తోందని ఆరోపించారు.





అఖిలపక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న చెన్నై జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ కుమారగురుబరన్

తిరుమలలో రేపు కార్తీక పౌర్ణమి గరుడసేవ

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం కార్తీక పౌర్ణమి గరుడసేవ జరుగనుంది. ఆరోజు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మాడవీధుల్లో మలయప్పస్వామిని ఊరేగిస్తారు. కార్తీక మాసంలోని పౌర్ణమి కావడంతో భక్తులు భారీగా వచ్చే అవకాశముందనే అంచనాతో టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తోంది.

వానమామలై జీయర్‌స్వామికి టీటీడీ పెద్ద మర్యాద

తిరుమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముంగునేరి వానమామలై మఠానికి చెందిన పరమహంసేత్యంతి మధురకవి వానామామలై జీయర్‌స్వామి సోమవారం తిరుమల శ్రీవారిని పెద్ద మర్యాదతో దర్శించుకున్నారు. ఉదయం అఖిలాండం వద్ద టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అర్చకబృందం ఆయనకు ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. ఆలయం నుంచి పల్లకీలో తీసుకెళ్లిన శఠగోపాన్ని సమర్పించి ఆహ్వానించారు. అనంతరం టీటీడీ పెద్దజీయర్ మఠానికి స్వామి చేరుకోగా ఈవో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. టీడీపీ ఎమ్మెల్యే, విప్ గణబాబు, ప్రభుత్వ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, సినీ నిర్మాత ఏఎం రత్నం, బాలీవుడ్ నటుడు తుషార్ కపూర్ ఉన్నారు.



శ్రీవారి ఆలయం వద్ద తుషార్ కపూర్


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.51 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,442

తలనీలాలు సమర్పించినవారు: 24,692



నా భర్తను చంపేశారు

- పోలీసులు న్యాయం చేయట్లేదు
- పీజీఆర్ఎస్‌లో ఎస్పీ ఎదుట బాధితురాలి మొర



చంటిబిడ్డతో ఎస్పీని కలిసిన హేమలత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'నాభర్తను మా అత్త, బావ చంపేశారు. పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు' అంటూ బాధితురాలు హేమలత ఎస్పీ సుబ్బరాయుడు ఎదుట సోమవారం పీజీఆర్ఎస్‌లో మొర పెట్టుకున్నారు. 'మాది వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం. సత్యవేడు మండలం మాదనపాలేనికి చెందిన కృష్ణకుమార్‌తో 2023లో నాకు వివాహమైంది. నా భర్తకు అన్న కిరణ్‌కుమార్, సోదరి అశ్విని ఉన్నారు. ఆ తర్వాత నేను డెలివరీ కోసం పుట్టింటికి వచ్చా. ఆ సమయంలో నా భర్త, అతడి అన్న మధ్య ఆస్తుల తగాదాలు చోటు చేసుకున్నాయి. అనంతరం తరచూ గొడవలు జరిగేవి. మా బావ కిరణ్‌కుమార్‌కు మగ బిడ్డ, ఆడ బిడ్డ ఉన్నారు. మాకు మగ బిడ్డ పుట్టడంతో, ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందన్న ఆక్రోశంతో నా భర్తను అంతమొందించాలని పథకం పన్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 12న ఇంట్లో ఉన్న నా భర్తపై అత్త వసంతమ్మ, బావ కిరణ్‌కుమార్ దాడి చేయడంతో మృతిచెందారు. నేను అత్తింటికి వెళ్లేటప్పటికే ఖననం చేశారు. నేను భయపడి పుట్టింటికి వచ్చా. వడమాలపేట పోలీసులకు ఫిర్యాదు చేశా. పోలీసులు కనీసం స్పందించలేదు. ఆ తర్వాత కర్మక్రియలకు వెళ్లగా నాపై నా భర్త మేనమామ కుమారుడు భరత్ కర్రలతో దాడి చేశారు. దీనిపై సెప్టెంబరు 28న ఫిర్యాదు చేశా. న్యాయం చేయాలని పలు సార్లు వడమాలపేట పోలీసులను ప్రాధేయపడినా పట్టించుకోలేదు. చివరకు సెప్టెంబరు 29న కేసు నమోదు చేశారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. నా భర్త చనిపోయిన సమయంలో మా అత్త ఇంట్లో ఉన్న నా పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు ఇప్పించాలని పోలీసులను కోరినా ఫలితం లేదు. ఇప్పటికీ నాకు న్యాయం చేయకపోగా పోలీసుల నుంచి ఒత్తిడి ఉంది. పెళ్లి సమయంలో మా అమ్మ వారు పెట్టిన 10 సవర్ల బంగారు నగలు మా అత్త వద్ద ఉన్నాయి. అవి ఇప్పించండం. నాకు న్యాయం చేయండి' అంటూ ఆమె చంటిబిడ్డతో వచ్చి ఎస్పీ సుబ్బరాయుడిని ప్రాధేయ పడ్డారు. దీనిపై విచారించి, న్యాయం చేస్తామని బాధితురాలికి ఎస్పీ హామీ ఇచ్చారు.

మా బాధలు ఆలకించండి

అధికారులకు అర్జీదారుల వేడుకోలు ● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 403 ఫిర్యాదులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'కలెక్టరేట్ చుట్టూ వారాల తరబడి తిరుగుతున్నా మా సమస్యలు పరిష్కారం కావడం లేదు. మీరైనా మా బాధలు ఆలకించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. దీపావళి, మొంథా తుఫాన్ కారణంగా గడచిన రెండు వారాలు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించలేదు. దీంతో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎన్నడూ లేని విధంగా 403 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 262 వినతులు వచ్చాయి. డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పట్టా ఇచ్చి ప్లాట్ చూపించలేదు



మేము కూలీనాలి చేసుకుని బతుకుతున్నాం. గత వైసీపీ ప్రభుత్వం ఆర్సీపురం మండలం నెన్నూరు వద్ద ఇంటి పట్టా ఇచ్చారు. తీరా స్థలం చూపించలేదు. నాలుగేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. మీరైనా స్పందించి మాకు ప్లాట్ చూపించండి

- గంగ, దామినేడు, తిరుపతి రూరల్ మండలం

పింఛను కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా..



నేను ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడిని. రెండేళ్ల కిందట ప్రమాదం జరిగి కాలు విరిగింది. నడవలేని స్థితిలో ఉన్నా. అంగవైకల్యం కింద పింఛను మంజూరు చేయాలని కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నా. ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా న్యాయం చేయండి.

- వెంకటాద్రి, రాజీవ్‌గాంధీ కాలనీ, రేణిగుంట

మీరైనా పింఛను ఇచ్చి ఆదుకోండి



అయ్యా నేను పెయింట్ పనిచేసుకునేవాడిని. నాలుగేళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో నడవలేని స్థితికి చేరుకున్నా. గత ప్రభుత్వంలో పింఛను కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయా. మీరైనా ఇచ్చి ఆదుకోండి.

- భాస్కర్, లింగేశ్వర్‌నగర్, తిరుపతి రూరల్ మండలం

మా ఇంటి స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారు



వెంకటగిరి పట్టణంలో 1.20 ఎకరాలు ఉంది. ఇందులో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాళ్లం. ప్రస్తుతం నీళ్లు లేకపోవడంతో చుట్టుపక్కల లేఅవుట్లు వెలిశాయి. మేమూ అందులో నివాసం ఏర్పరచుకుని ఉన్నాం. మా అనుభవంలో ఉన్న ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు వీఆర్వో, సర్వేయర్ ద్వారా మా సమీప బంధువు నరసింహారావు ప్రయత్నిస్తున్నారు. అతడిపై చర్యలు తీసుకోండి.

- యమున, నాగులగుంట పాళెం, వెంకటగిరి

గుకూరు చెరువును పరిరక్షించండి



చెరువు కలుజుకు అడ్డంగా కంచె నాటి, చెరువును పూడ్చి ఇల్లు కడుతున్నారు. దీంతో స్వరూపమే మారిపోతోంది. స్పందించి చెరువును పరిరక్షించాలి. చెరువులో ఉన్న పట్టాలను రద్దు చేయాలి.

- గూళూరు చెరువు ఆయకట్టుదారులు, వడమాలపేట మండలం

వైద్య విద్యార్థులపై దాడి ఘటనలో చర్యలు తీసుకోండి



వైద్య విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోండి. రుయా అత్యవసర విభాగంలో పనిచేసే మేము రెండు రోజుల క్రితం విధులు ముగించుకుని అల్పాహారం కోసం వెళుతుండగా వెస్ట్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసులు ఆపారు. మేము వైద్య విద్యార్థులమని, టిఫిన్ తినడానికి వెళుతున్నామని చెప్పినా వినలేదు. దాడి చేసి, దూషించారు. వారిపై చర్యలు తీసుకోండి.

- ఎస్వీ మెడికల్ కళాశాల విద్యార్థుల డిమాండ్

చిత్రజ్యోతి

SINCE 1965


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్స్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి.



దీక్షిత్ శెట్టి

'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.



అవకాశం వస్తే తమిళంలోనూ నటిస్తా

● ఇలియానా

ఇలియానా మళ్లీ నటించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. తన అందంతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసిన ఇలియానా తెలుగు, కన్నడం, హిందీ చిత్రాలతో పాటు తమిళంలో 'కేడి', 'నన్బన్' తదితర చిత్రాల్లో నటించారు. 2023లో మైఖేల్ డోలన్‌ను వివాహం చేసుకున్న ఇలియానా, ఇద్దరు పిల్లలకు తల్లి అయింది. ఈ ఏడాది ఏ చిత్రంలోను నటించని ఇలియానా, ప్రస్తుతం మళ్లీ నటించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో, తమిళ సినిమాల్లో నటించకపోవడానికి కారణం ఏమిటని అడిగిన ప్రశ్నకు, 'నేను నటించలేదని చెప్పలేదు... నన్ను పిలిస్తే పరుగెత్తుకుంటూ వస్తాను'... అంటూ నవ్వుతూ సమాధానమిచ్చింది. ఈ మాట ఇలియానా అభిమానులను మరింత ఉత్సాహం అందించింది.

లోకేష్ కనకరాజ్, వామికా కబి చిత్రం 'డీసీ'





కోలీవుడ్ అగ్రదర్శకుల్లో ఒకరైన లోకేష్ కనకరాజ్ సూపర్‌స్టార్ రజనీ, కమల్, విజయ్, కార్తీ తదితరులతో హిట్ చిత్రాలు నిర్మించి తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారు. చివరిగా ఆయన దర్శకత్వం వహించిన 'కూలి' చిత్రం రూ.600 కోట్లు వసూలుచేసింది. తదుపరి 'ఖైదీ 2' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ క్రమంలో, ఆయన హీరోగా పరిచయం కానున్నారు. ఈ చిత్రానికి అరుణ్ మాదేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైన నేపథ్యంలో, ప్రస్తుతం ఆ చిత్రంపై ప్రకటన వెలువడింది. ఈ చిత్రం 'డీసీ' (ஈஇ) అనే పేరుతో విడుదల కానుంది. కథానాయకిగా 'మాలై నేరత్తు మయక్కం' ఫేం వామికా కబి నటిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన 'డీసీ' ఫస్ట్ లుక్‌లో మొఖమంతా గాయాలతో లోకేష్ కనిపించాడు. చిత్రంలో 'దేవదాస్' అనే క్యారెక్టర్‌లో ఆయన నటిస్తున్నారు. వామికా కబి వ్యభిచార వృత్తి చేసేలా 'చంద్ర' అనే రోల్ చేస్తోంది. వీరిద్దరూ క్యారెక్టర్ పేర్లతో సంక్షిప్తంగా 'డీసీ (ஈஇ)' అనే పేరు పెట్టారు. ఈ చిత్రం యాక్షన్ కథాంశంతో రూపొందుతోందని యూనిట్ వర్గాల సమాచారం.

చిత్రజ్యోతి

కుమార్తె పేరుతో కొత్త 'ఆర్కెస్ట్రా'

● ప్రారంభించనున్న ఇళయరాజా



దివంగత కుమార్తె భవతరణితో ఇళయరాజా

సంగీత ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక స్థానం పొందిన ఇసైజ్ఞాని ఇళయరాజా కుమార్తె భావతరణి కూడా అభిమానులను సంపాదించుకుంది. ఇళయరాజా సంగీత దర్శకత్వం వహించిన 'రాచప్ప' చిత్రంలో 'మస్తానా...మస్తానా' పాటతో భావతరణి సినీ పరిశ్రమకు పరిచయమైంది. అలాగే, 'అనేకన్'; 'ఇరుంబు కుదిరై', 'బిరియానీ', 'మంగాత్తా', 'ఫ్రెండ్స్', 'నేరుక్కునేర్' సహా పలు చిత్రాల్లో ఆమె పాడిన పాటలు హిట్‌గా నిలిచాయి. ఇళయరాజా సంగీత దర్శకత్వంలో విడుదలైన 'భారతి' చిత్రంలో 'మయిలై పోల పొన్ను ఒన్ను...' అనే పాట ఆమెకు జాతీయ అవార్డు తెచ్చిపెట్టింది. కొన్ని చిత్రాలకు ఆమె సంగీత దర్శకత్వం వహించారు. ఈ క్రమంలో, గత ఏడాది జనవరిలో కాన్సర్ కారణంగా ఆమె మృతిచెందారు. ఏఐ ద్వారా 'ది గోట్' చిత్రంలో భవతరణి స్వరం వినియోగించడంతో అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రస్తుతం, తన కుమార్తె స్మారకార్థం 'భవత మహిళా ఆర్కెస్ట్రా' ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేపట్టినట్లు, మహిళా గాయకులు, సంగీత కళాకారులు తనను సంప్రదించవచ్చని ఇళయారాజా విజ్ఞప్తి చేశారు.

కోడియక్కరైలో విదేశీ విహంగాల విహారం





టి.నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా వేదారణ్యం సమీపంలో కోడియక్కరై వన్యప్రాణుల అభయారణ్య ప్రాంతానికి వందల సంఖ్యలో విదేశీ పక్షులు తరలివస్తున్నాయి. ఈ ప్రాంతానికి ప్రతియేటా ఈశాన్య రుతుపవనాల ప్రభావిత వర్షాకాలంలో వివిధ దేశాల నుండి వేలసంఖ్యలో పక్షులు గుంపులు గుంపులుగా వస్తుంటాయి. ముఖ్యంగా ఐరోపా, సైబీరియా, ఆస్ట్రేలియా, శ్రీలంక తదితర దేశాల నుండి ప్రతియేటా 247 రకాల పక్షులు ఈ ప్రాంతానికి వచ్చి వెళ్తున్నాయని పక్షుల పరిశోధకులు చెబుతున్నారు. ఇటీవల విస్తారంగా వర్షాలు కురవటంతో ఎప్పటిలాగే విదేశీ పక్షులు వస్తున్నాయి. ఈ శరణాలయ ప్రాంతంలో అక్కడక్కడా పక్షులు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ ప్రాంతానికి వచ్చే పెలికాన్ పక్షులు ప్రస్తుతం తక్కువ సంఖ్యలోనే కనిపిస్తున్నాయి. ఇవిగాక గూడబాతులు, నన్నటిముక్కు కొంగలు. కడలికాకులు, బుట్టబాతులు, బూడిదరంగు బాతులు వంటి రకాలు చెందిన పక్షులు వేల సంఖ్యలో ఇక్కడ కనిపిస్తున్నాయి. అదే సమయంలో కొడవలి ముక్కు కొంగలు, నల్ల గూడబాతులు వేట్టైకారనిరుప్పు ప్రాంతంలోని చిత్తడి భూములు, అలపరప్పు, ఆల్‌కొండాన్ ఏరి, వంటి నీటివనరుల లోతట్టు ప్రాంతాల్లో అధికంగా కనిపిస్తున్నాయి. ఈశాన్యరుతుపవనాల సమయంలో సంతోనోత్పత్తికి అనువైన వాతావరణం, సమృద్ధిగా ఆహారం లభించడం వంటి కారణాల వల్లే కోడియక్కరై ప్రాంతానికి వచ్చే విదేశీ పక్షుల సంఖ్య ప్రతియేటా పెరుగుతూనే ఉందని స్థానిక పక్షుల ప్రేమికులు చెబుతున్నారు.



కోలాహలంగా తిల్లైగోవిందరాజ పెరుమాళ్ ఆలయ కుంభాభిషేకం

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన చిదంబరం నటరాజస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న తిల్లైగోవిందరాజ పెరుమాళ్ ఆలయానికి 30 యేళ్ల అనంతరం సోమవారం కుంభాభిషేకం నిర్వహించారు.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన చిదంబర నటరాజ ఆలయంలో ఒకే ప్రాంతంలో నటరాజ సన్నిధి (శైవ), తిల్లైగోవిందరాజ పెరుమాళ్ (వైష్ణవ) ఆలయాలుండడం విశేషం. ఈ ఆలయానికి వెళ్లే భక్తులు ఒకే ప్రాంతంలో నిలబడి శివకేశవులను దర్శించుకుంటారు. 108 దివ్యదేశాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన తిల్లైగోవిందరాజ పెరుమాళ్ సన్నిధిలో ప్రతిఏటా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. చిత్రకూటం అనే పేరు కలిగిన ఈ ఆలయంలో మూలవర్ గోవిందరాజస్వామి ఆనంద శయనుడిగా, ఉత్సవమూర్తి దేవాదిదేవుడు ఆశీనుడై పూజలందుకుంటున్నారు. అంతేకాకుండా ఆలయంలో అద్దాల మండపం కూడా ఉండటం విశేషం. పల్లవరాజుల్లో ఒకరైన నరసింహవర్మ సా.శ.717-782వ శతాబ్ధంలో ఈ ఆలయాన్ని అద్భుత శిల్పకళానైపుణ్యంతో నిర్మించినట్లు స్థలపురాణం. ఆలయ జీర్ణోద్ధరణ పనుల సందర్భంగా విమాన, రాజగోపురాలు, మహామండపాలు పుండరీకవల్లి తాయారు సన్నిధి, గరుడాళ్వార్ సన్నిధులకు 30యేళ్ల అనంతరం పునరుద్ధరించి సోమవారం అష్టబంధన, మహాసంప్రోక్షణ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.



ఆలయ ప్రధాన గోపుర కలశానికి కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీరామచంద్రలో 'ఆంకో కేర్'



ఆంకోకేర్ ప్రారంభోత్సవంలో వైద్య నిపుణులు

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (శ్రీహెర్)లో 'ఆంకో కేర్' ఏర్పాటైంది. దీనిని సోమవారం నగరంలోని క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ ఇ.హేమంత్ రాజ్, శ్రీహెర్ ఛాన్సలర్ వీఆర్ వెంకటాచలం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమంత్‌రాజ్ మాట్లాడుతూ.. వైద్యులు చికిత్స అందించడంతో పాటు రోగులకు సమయం కేటాయించి, వారి ఆందోళన విని, భావోద్వేగ మద్దతు అందించాలని సూచించారు. వ్యాధి తీవ్రత, అందుబాటులో వున్న చికిత్సను అర్థం చేసుకోవడానికి రోగుల కుటుంబ సభ్యులతో సమర్థవంతంగా అందించాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. ఇదిలా వుండగా శ్రీహెర్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఉమా శేఖర్ మాట్లాడుతూ.. ఈ ఆంకోకేర్‌లో సెంటర్ సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ, హెమటాలజీ, పీడియాట్రిక్ ఆంకాలజీ విభాగాలను ఏకం చేయడం ద్వారా పాథాలజీ, రేడియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్, రిహాబిలిటేషన్, సైకో-అంకాలజీ నుంచి ప్రత్యేక మద్దతు కలిపి అన్నీ కలిగి వున్న క్యాన్సర్ సంరక్షణను ఒకే కప్పు కిందకు తీసుకువచ్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.బాలాజీ సింగ్, డాక్టర్ ఆర్వీ సుధాకర్ సింగ్, డాక్టర్ పి.నరేంద్రన్, డాక్టర్ ఎస్.జగదీష్‌చంద్ర బోస్, డాక్టర్ కె.సతీష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎం ప్రైమ్ హాస్పిటల్‌లో జీర్ణకోశ, కాలేయ రోగాలకు చికిత్సా కేంద్రం



ప్రత్యేక చికిత్సా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సినీ నటుడు పార్తీబన్, వైద్యనిపుణులు

చెన్నై, నవంబరు3(ఆంధ్రజ్యోతి): స్థానిక రామాపురంలోని ఎస్‌ఆర్‌ఎం ప్రైమ్ హాస్పిటల్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ అండ్ లివర్ డిసీజస్ పేరుతో ప్రత్యేక చికిత్సా కేంద్రాన్ని ప్రముఖ సినీనటుడు, దర్శకుడు పార్తీబన్ సోమవారం ప్రారంభించారు. ఈ కేంద్రం అన్ని వయస్సులవారికి అంతర్జాతీయ స్థాయి వైద్యం అందిస్తుందని, అంతే కాకుండా ఈ కేంద్రంలో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎండోస్కోపిక్ పరికరం కూడా ఉందని ఆ హాస్పిటల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.శివ తెలిపారు. రోజుకు 24 గంటలపాటు ఈ కేంద్రంలో వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కేంద్రం ప్రాథమిక స్థాయిలో క్యాన్సర్ బాధితులకు చక్కటి చికిత్స అందజేయగలుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి జీర్ణకోశ విభాగం అధిపతి డాక్టర్ అరుళ్ ప్రకాష్, డాక్టర్ తరుణ్ జే జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో సీయూబీ

● రూ.3258 కోట్లకు పెరిగిన వడ్డీ ఆదాయం

● బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.కామకోడి



చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత సెప్టెంబరు 30వ తేదీతో ముగిసిన అర్ధ వార్షిక ఫలితాల ప్రకారం సిటీ యూనియన్ బ్యాంక్ లాభాల బాటలో పయనిస్తోందని, రుణాల మంజూరులో ముందంజలో ఉందని ఆ బ్యాంక్ మేజింగ్ డైరెక్టర్ ఎన్.కామకోడి తెలిపారు. ఆ బ్యాంక్ అర్ధవార్షిక ఫలితాలను సోమవారం ఉదయం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఆమోదించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఫలితాల ప్రకారం వడ్డీ ఆదాయం 15 శాతం పెరిగి రూ.3258 కోట్లకు చేరిందని, వడ్డీయేతర ఆదాయం 20 శాతం పెరిగి రూ.503 కోట్లకు చేరిందని ఆయన వివరించారు. ఇదే విధంగా బ్యాంక్ మొత్తం ఆదాయం 16 శాతం పెరిగి, రూ.3761 కోట్లకు చేరిందన్నారు. నికర వడ్డీ ఆదాయం కూడా 15 శాతం పెరిగి, 1292 కోట్లకు చేరిందని తెలిపారు. ఈ అర్ధసంవత్సరంలో బ్యాంక్ రూ.69,486 కోట్ల మేరకు డిపాజిట్లు పెంచామని, అదే విధంగా రుణాల మంజూరులోనూ ఆధిక్యత సాధించి, ఇప్పటివరకూ రూ.57,561 కోట్ల మేరకు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు.

ధర్మపురిలో రూ.39.14 కోట్లతో కొత్త బస్‌స్టేషన్

● నిర్మాణ పనులను పరిశీలించిన సీఎం స్టాలిన్



బస్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలో ఎ. రెడ్డిహళ్లి గ్రామం వద్ద పదెకరాల విస్తీర్ణంలో రూ.39.14 కోట్లతో ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మిస్తున్న బస్‌స్టేషన్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పరిశీలించారు. సోమవారం ఉదయం ఆయన ధర్మపురిలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా బస్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బస్‌స్టేషన్ దిగువ దళం, మొదటి అంతస్థులో దుకాణాలు, హోటళ్లు, ఏటీఎం సెంటర్, లగేజీ భద్రపరిచే గది, మరుగుదొడ్లు, టైమ్‌కీపర్ గది, పైకప్పు నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు.

సిప్కాట్ సందర్శన... : ధర్మపురి సిప్కాట్ ప్రాంతానికి కూడా స్టాలిన్ అధికారులతో కలిసి సందర్శించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న ఆఫీసు భవన నిర్మాణ పనులు, వాననీటి కాల్వల పనులను పరిశీలించారు. ఈ పనులన్నింటినీ వీలైనంత త్వరగా పూర్తి చేయమని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సిప్కాట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం రూ.937.36 కోట్ల మేరకు నిధులు కేటాయించిందన్నారు. ఈ పనులన్నీ ఈ యేడాది ఆఖరులోగా పూర్తవుతాయని ఆయన వివరించారు. సీఎంతోపాటు మంత్రులు ఈవీ వేలు, ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, ఆర్ రాజేంద్రన్, ఎస్ఎస్.శివశంకర్, మాజీ మంత్రి పళనియప్పన్, ధర్మపురి జిల్లా కలెక్టర్ ఆర్.సతీష్, నగరపాలక నిర్వహణ విభాగం డైరెక్టర్ పి.మధుసూదన్ రెడ్డి, సిప్కాట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే సెంథిల్‌రాజ్ తదితరులున్నారు.

అపోలో ఆయుర్వేద హాస్పిటల్ ప్రారంభం



ఆయుర్వేద హాస్పిటల్ ప్రారంభోత్సవ దృశ్యం

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో ప్రసిద్ధి చెందిన అపోలో హాస్పిటల్స్ గ్రీమ్స్ రోడ్డులో ఆయుర్వేద ఆసుపత్రిని ప్రారంభించింది. 35 పడకలతో కూడిన ఈ ఆసుపత్రిని అపోలో సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ పీతా రెడ్డి, అపోలో ఆయుర్వేద హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ వాసుదేవన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఆయుర్వేదం మానవాళికి ఇచ్చిన గొప్ప బహుమతుల్లో ఒకటన్నారు. అపోలోలో ఆయుర్వేదం, ఖచ్చితత్వం, ఆధారాలు, రోగి భద్రతతో ఆచరించబడినప్పుడు, వ్యాధి మూల కారణాలను పరిష్కరించడం, శ్రేయస్సు మెరుగుపరచడం ద్వారా ఆధునిక వైద్యానికి పూరకంగా వుంటుందని తాము ఆశిస్తున్నట్లు తెలిపారు. అపోలో ఆయుర్వేద ఆస్పత్రుల ద్వారా రెండు ప్రపంచాల ఉత్తమమైన వాటిని మిళితం చేసే సమగ్ర, రోగి కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణలో భారత నేతృత్వాన్ని తాము బలోపేతం చేస్తున్నామని వివరించారు. డాక్టర్ పీతా రెడ్డి మాట్లాడుతూ.. అపోలోలో ఆరోగ్య సంరక్షణ సమగ్రంగా వుండాలని, ప్రతి రోగి అవసరాల చుట్టూ కేంద్రీకృతమై వుండాలని తాము ఎల్లప్పుడూ విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు.

కుండ్రత్తూరులో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కలైసెల్వి మోహన్

చెన్నై, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): 'ఇండియా టర్న్స్ పింక్' ఆధ్వర్యంలో కుండ్రత్తూరు పంచాయతీ యూనియన్‌లో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహనా కార్యక్రమం జరిగింది. మహిళల్లో ముందస్తు గుర్తింపు, నివారణ ఆరోగ్య సంరక్షణ ప్రోత్సహించడంలో భాగంగా పడప్పైలోని బీడీవో కార్యాలయంలో సోమవారం ఈ శిబిరాన్ని నిర్వహించారు. కాంచీపురం జిల్లా కలెక్టర్ కలైసెల్వి మోహన్, ఇండియా టర్న్స్ పింక్ వ్యవస్థాపకులు, పీఏ ఆనందకుమార్, నవీన్స్ డైరెక్టర్ క్షీర్ వసుధ కుమార్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో క్యాన్సర్ గుర్తింపు పరీక్షలు కష్టంగా, సమయం తీసుకునేవిగా ఉండేవన్నారు. కానీ నేడు ఆధునిక రోగ నిర్ధారణ సాధనాలతో, ముందస్తు గుర్తింపు చాలా సులభమవుతోందని, ఒకటి లేదా రెండు దశల్లో క్యాన్సర్‌ను గుర్తిస్తే, దానిని నివారించవచ్చన్నారు.

చెన్నై కామరాజర్ పోర్ట్‌లో రూ.26,000 కోట్ల పనులు

● ఎండీ జేపీ ఐరిన్ సింథియా



ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నై కామరాజర్ పోర్ట్ ఆధ్వర్యంలో రూ.26,000 కోట్లతో కొత్త పథకం పనులు చేపట్టనున్నట్లు ఆ పోర్ట్ మేనేజింగ్ డైరెక్టర్ జేపీ ఐరిన్ సింథియా ప్రకటించారు. ఈ మేరకు ఆ పోర్ట్ కార్యాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి. కేంద్ర ఓడరేవులు, నౌకా యాన మంత్రిత్వశాఖ ముంబయిలో గత నెల 27 నుండి 31వ తేదీ వరకు నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి మహానాడులో కామరాజర్ పోర్టు కూడా పాల్గొంది. ఈ పోర్ట్ పనితీరు, భవిష్యత్తు ప్రణాళిక, అభివృద్ధి పనులు తదితర అంశాలపై 27 కార్పొరేట్ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం రూ.26,000 కోట్ల విలువైన పనులు చేపట్టి ఓడరేవు అభివృద్ధి, ఆధునికీకరణ, సరుకుల ఎగుమతి, దిగుమతి పెంపు, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం, ఓడరేవులకు అనుబంధ రహదారులు, రైలుమార్గాల విస్తరణ తదితర పనులు చేపట్టనున్నట్లు కామరాజర్ పోర్ట్ ఎండీ ఐరిన్ సింథియా తన ప్రకటనలో తెలిపారు.

8 వరకు మోస్తరు వర్షాలు

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 8వ తేది వరకు ఒకటి, రెండు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముందని చెన్నై వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... మధ్య తూర్పు బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతం మియన్మార్ వద్ద సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం ఉత్తర వాయువ్య దిశగా పయనించి మియన్మార్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటుతుందన్నారు. అదే సమయంలో తూర్పు దిశ గాలుల వేగంలో మార్పు చోటుచేసుకుంది. ఈ ప్రభావంతో, మంగళవారం నుంచి ఈ నెల 8వ తేది వరకు రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. చెన్నై, శివారు ప్రాంతాల్లో రాబోయే 48 గంటల్లో ఆకాశం మేఘావృతమై కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

సమాచార దృశ్యం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు (ఈబీ) విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి.. పల్లావరం పరిధిలోని న్యూ కాలనీ, రెండవ క్రాస్ వీధి, శాస్త్రి కాలని, జీఎస్‌టీ రోడ్డు, సీఎల్‌సీ లైన్ 11వ వీధి, అమ్మన్ ఆలయ వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపింది.

పాఠశాల గదులపై కూల్ రూఫ్

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో వేడి తగ్గించేలా 'కూల్ రూఫ్' ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తగినంత గాలి వసతి లేని తరగతి గదులు వేడితో కూడుకుంటున్నాయని, ఈ కారణంగా విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేకపోతున్నారని విద్యా వేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య అధికమించేలా తొలివిడతగా, 300 ప్రభుత్వ పాఠశాలల్లో కూల్ రూఫ్ టెక్నాలజీ ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, భవనాల పైకప్పుపై సోలార్ రిఫ్లెక్టివ్ సిల్కా కూల్ రూఫ్ పెయింటింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

నేడు కోవైకు ఉప రాష్ట్రపతి

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆలయ సందర్శనార్థం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మంగళవారం మళ్లీ కోవై రానున్నారు. తిరువనంతపురం నుంచి మంగళవారం సాయంత్రం 5.05 గంటలకు ప్రత్యేక విమానంలో బయల్దేరి, 5.55 గంటలకు కోవై విమానాశ్రయం చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కోవై జిల్లా పిలిచ్చిఐన్నిపాళయంలో వెలసిన ఎల్లైకరుప్పారయర్ ఆలయానికి వెళ్లనున్నారు. ఆలయంలో జరిగే పూజల్లో పాల్గొనే ఉపరాష్ట్రపతి అక్కడి నుంచి రాత్రి 7 గంటలకు కోవై చేరుకోనున్నారు. 7.35 గంటలకు విమానంలో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌కు ఉప రాష్ట్రపతి వెళ్లనున్నారు. ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఆయన ప్రయాణించే మార్గాలు, ఆలయ పరిసరాలు, విమానాశ్రయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఉపాధ్యాయులు, విద్యార్థులకు 'ఏఐ' సంబంధిత ఉచిత విద్య

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'కృత్రిమ మేథస్సు (ఏఐ) నైపుణ్యాలపై ఐదు కోర్సులను ఆన్‌లైన్‌లో ఉచితంగా అందిస్తోంది. కృత్రిమ మేథస్సు సాంకేతికత ప్రభావం రోజురోజుకూ పెరుగుతోంది. ఆ ప్రకారం, విద్యలో వివిధ మార్పులు చేయాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. మొదటి దశలో, మూడో తరగతి నుంచి కృత్రిమ మేథస్సుకు సంబంధించి అంశాలు ప్రవేశపెట్టనుంది. అలాగే, క్రీడలు, విద్య, సైన్స్, ఫైనాన్స్ వంటి రంగాల్లో కృత్రిమ మేథస్సు, డేటా సైన్స్ నైపుణ్యాలను అభివృద్ధి చేసేలా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, నిపుణులకు ఉచిత ఆన్‌లైన్ కోర్సులు అందించనుంది. ఆ ప్రకారం, కేంద్ర ప్రభుత్వ విద్యా పోర్టల్ 'స్వయం' ద్వారా మెషీన్ లెర్నింగ్, క్రికెట్ విశ్లేషణ, భౌతిక, రసాయన శాస్త్రాలు, అకౌంటింగ్ రంగాల్లో కృత్రిమ మేథస్సు వినియోగంపై పాఠాలు తగిన వివరణలతో నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు, ఉపాధ్యాయులు https://swayam.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా పాల్గొనవచ్చు. కోర్సు ముగిసిన తర్వాత విద్యా మంత్రిత్వ శాఖ తరఫున సర్టిఫికేట్ అందించనున్నారు.

'ఫుల్ బాడీ చెకప్' పథకంలో గుండెపోటు గుర్తించే సౌకర్యం

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓమందూర్ ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో, 'ఫుల్ బాడీ చెకప్' పథకంలో రెండు నిమిషాల్లో గుండెపోటు గుర్తించే సౌకర్యం కల్పించారు. ఈ విషయమై ఆస్పత్రి సమన్వయ అధికారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. ఓమందూర్ ప్రభుత్వాస్పత్రిలో ఫుల్ బాడీ చెకప్ పథకం అమలులో ఉందన్నారు. నాలుగు రకాల చార్జీలతో ఈ పథకం అందిస్తున్నామన్నారు. అందులో 'ప్లాటినం ప్లస్' ప్లాన్‌లో రూ.4,000 రుసుముతో 'ట్రెడ్‌మిల్' గుండె ఒత్తిడి పరీక్ష నిర్వహించనున్నామన్నారు. కానీ ఇది అందరూ చేసుకోలేకపోవడంతో, ఈసీజీ, ఎకో తదితరాలతో గుండె ఒత్తిడిని రెండు నిమిషాల్లో తెలుసుకునే సదుపాయం కల్పించామన్నారు. ఆ ప్రకారం, 'సీడీ కాల్షియం స్కోరింగ్' అనే పరీక్ష, రక్తాన్ని తీసుకెళ్లే రక్తనాళాల్లో అడ్డంకులున్నాయో, లేదో ఖచ్చితంగా తెలుసుకునేందుకు సహాయపడుతుందన్నారు. ప్లాటినం ప్లస్ ప్లాన్‌లో 'ట్రెడ్‌మిల్' పద్ధతికి బదులు ఈ పరీక్ష చేయించుకోవచ్చిని, అయితే, ఈ పరీక్ష వైద్యుడి సిఫారసు మేరకు మాత్రమే చేయనున్నట్లు ఆయన తెలిపారు.

'నమ్మ స్కూల్ ప్రాజెక్ట్' విరాళాల కోసం ఒత్తిడి లేదు...!

● పాఠశాల విద్యాశాఖ

అడయార్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'నమ్మ స్కూల్ ప్రాజెక్ట్'కు విరాళాలు వసూలుచేయాలని జిల్లా విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులపై ఎలాంటి ఒత్తిడి చేయడం లేదని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. రాష్ట్రంలో అమలుచేస్తున్న నమ్మ స్కూల్ ప్రాజెక్ట్‌కు విరాళాలివ్వాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు పీఎంకే నేత అన్బుమణి ఇటీవల ఆరోపించారు. ఈ విషయమై సోమవారం పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ప్రకటనలో... నమ్మ స్కూల్ ప్రాజెక్ట్‌కు విరాళాలు సేకరించాలని ఒత్తిడి చేయడం లేదన్నారు. కార్పొరేట్ సంస్థలు ఇస్తున్న సామాజి సేవా నిధులు, పూర్వ విద్యార్థులు, దాతలు తమకు తాముగా విరాళాలు అందిస్తే స్వీకరించాలని తెలిపామన్నారు. ఈ విరాళాలతో పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనకు మాత్రమే వినియోగిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

తిరువళ్లూర్‌లో నమూనా జనగణన

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా ఆర్కే పేట సమీపంలోని 17 గ్రామాల్లో నమూనా జనగణన నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతాప్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో... 2027లో చేపట్టనున్న కులలవారీ జనగణనకు ముందుగా ఈ నమూనా జనగణన జరుగుతుందన్నారు. ఈ నమూనా జన గణనలో 97 మంది టీచర్లు పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

మాధవరం జోన్‌లో రూ.1.49 కోట్లతో క్రీడా మైదానం

● ప్రారంభించిన మేయర్ ప్రియ

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాధవరం జోన్ 28వ వార్డు పరిధిలో కోల్‌కతా షాప్ వీధిలో రూ.1.49 కోట్లతో నిర్మించిన ఫుట్‌బాల్ క్రీడామైదానాన్ని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ సోమవారం ఉదయం ప్రారంభించారు. ఆ సందర్భంగా స్థానిక క్రీడాకారులకు క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. 35,241 చదరపుటడుగుల విస్తీర్ణం కలిగిన ఈ మైదానంలో ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ తదితర క్రీడలకు వీలుందని మేయర్ తెలిపారు. మైదానం చుట్టూ సీసీ కెమెరాలు కూడా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరం శాసనసభ్యుడు ఎస్.సుదర్శనం, జోనల్ కమిటీ నాయకుడు ఎస్.నందగోపాల్ కార్పొరేటర్లు కనిమొళి సురేష్, ఎ.చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడామైదానాన్ని ప్రారంభిస్తున్న మేయర్

సువానీ నగరంలో ముగిసిన సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రసంగిస్తున్న ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నరసింహులు

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని సువానీ నగరం గ్విన్నెట్ కౌంటీ పబ్లిక్ లైబ్రరీ ప్రాంగణంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'ఆర్ట్ ఫర్ ఆల్ కేంపైన్' సాంస్కృతిక కార్యక్రమాలు ముగిశాయి. ఈ వేడుకల్లో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నరసింహులను ఘనంగా సత్కరించారు. ఆయన దాతృత్వం, నాయకత్వం కారణంగానే ఈ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఉత్తేజపరిచాయి. ఈ వేడుకల ప్రచారం విజయవంతం కావటమే కాకుండా కొత్త కుడ్యచిత్రాలను కూడా ఆవిష్కరించారు. సీజీఐ అట్లాంటాకు చెందిన రమేష్‌బాబు లక్ష్మణన్, సువానీ నగర మేయర్ జిమ్మీ బర్నెట్, నగర అధికారులు, కళా పోషకులు, సువానీ పబ్లిక్ ఆర్ట్ కమిషన్ సభ్యులు హాజరయ్యారు.

వ్యాయామ ఉపాధ్యాయుడి అరెస్ట్

8వ తరగతి విద్యార్థినికి గర్భం

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మైలాడుదురై సిద్దర్‌కాడు మరైయూర్ రోడ్డు ప్రాంతానికి చెందిన సాంసన్ ప్రభాకరన్ ఓ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ పాఠశాలలో గత విద్యా సంవత్సరం 8వ తరగతి చదివిన 14 ఏళ్ల దివ్యాంగ విద్యార్థిని, ప్రస్తుతం పై చదువులకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో, ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమెను తల్లిదండ్రులు మైలాడుదురై ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆమెను పరీక్షించిన నిర్వహించిన వైద్యులు, ఐదు నెలల గర్భంతో ఉన్నట్లు నిర్ధారించారు. ఈ వ్యవహారంపై విద్యార్థినిని మైలాడుదురై మహిళా పోలీసులు విచారణ చేపట్టగా, గర్భానికి కారణంగా ఉపాధ్యాయుడు సాంసన్ ప్రభాకరన్ అని తెలిసింది. ఈ కారణంగా పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

ఆదికుంభేశ్వరాలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లాలో ఆలయాల నగరంగా ప్రసిద్ధి చెందిన కుంభకోణం మంగళాంబికా సమేత ఆది కుంభేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహామఖంతో సంబంధాలున్న 12 శైవక్షేత్రాల్లో ప్రధానమైన ఆదికుంభేశ్వరాలయ ప్రాంగణంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠకు దేవాదాయశాఖ రూ.15లక్షలు కేటాయించింది. ఈ ఆలయానికి కుంభాభిషేకం నిర్వహించి 12యేళ్లు పూర్తయిన నేపథ్యంలో, గత ఏడాది జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారు. వాటిని పూర్తిచేసి వచ్చే డిసెంబర్ 10న కుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఈ ఆలయంలోని పాత ధ్వజస్తంభాన్ని తొలగించి నూతన ధ్వజస్తంభాన్ని మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రతిష్ఠించారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆలయ అర్చకులు

రాష్ట్రంలో మహిళలకు భద్రతలేదు

● గ్యాంగ్‌రేప్‌పై నేడు రాష్ట్రవ్యాప్త ధర్నా ● నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని, ప్రతిరోజు లైంగిక వేధింపులు, అత్యాచారాలు జరుగుతున్నాయని, దీనిని అడ్డుకోని డీఎంకే ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ మంగళవారం రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ప్రకటించారు. కోవైలో ఆదివారం అర్ధరాత్రి కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలంరేపింది. ఈ నేపథ్యంలో, కోవైలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఉదయం ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు వానతీ శ్రీనివాసన్‌తో కలిసి నయినార్ నాగేంద్రన్ మీడియాతో మాట్లాడారు. 2021వ సంవత్సరంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలో కూర్చున్నప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని, డీఎంకే ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. పోలీస్ శాఖ కూడా ప్రజా రక్షణలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, విమర్శించారు. డీఎంకే ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో బీజేపీ తరుపున ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆ తర్వాత వానతీ శ్రీనివాసన్ మాట్లాడుతూ, అత్యాచారానికి పాల్పడిన వారిపై గూండా చట్టం ప్రయోగించి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యేలు నయినార్ నాగేంద్రన్, వానతీ శ్రీనివాసన్ తదితరులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

తిరుత్తణి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని నెడియం, కరింబేడు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిరుక్కురల్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్లబ్ అధ్యక్షుడు ఏడీ లోకనాథుడు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తిరువళ్లువర్ రచించిన పుస్తకం ప్రతి ఒక్కరికి మార్గదర్శకమని తెలిపారు. అనంతరం విద్యార్థులకు తిరుక్కురల్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఎండీ భాస్కరన్, సెక్రటరీ పార్థివశెట్టి, జిల్లా కార్యదర్శి వెంకటపతి, నిర్వాహకులు లలిత్‌కుమార్, విజయ్‌కుమార్, కె. ఈశ్వర్‌ప్రసాద్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మాంజా దారంతో గాలిపటం.. యువకుడి అరెస్ట్

అడయార్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిషేధిత మాంజా దారంతో గాలిపటం ఎగురవేస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మాంజా దారంతో గాలిపటాలు ఎగురవేస్తున్న సమయంలో, అవి తెగి దారం మెడకు చుట్టుకుని పలువురు ద్విచక్రవాహనదారులు, పాదచారులు గాయపడ్డారు. ఈ ఘటనల నేపథ్యంలో, నగరంలో మాంజా దారం తయారీ, విక్రయాలు, గాలిపటాలు ఎగురవేయడంపై నగర పోలీసు శాఖ నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో, ఎంకేబీ నగర్ పోలీస్ స్టేషన్ సీఐ నేతృత్వంలో పోలీసులు ఆదివారం సాయంత్రం గస్తీ తిరుగుతున్న సమయంలో, వ్యాసర్పాడి శాస్త్రి నగర్ 6వ క్రాస్ వీధిలోని ఓ మిద్దెపై నుంచి మాంజా దారంతో గాలిపటం ఎగురవేస్తుండడం గుర్తించారు. ఈ ఘటన కు సంబంధించి వ్యాసర్పాడి శాస్త్రి నగర్‌కు చెందిన విజయ్ (25) పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆలయ పునరుద్ధరణ పనుల్లో బంగారు నాణేలు లభ్యం

అడయార్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా జవాదుమలై కొండ గ్రామంలో గుంత తవ్వుతుండగా బంగారు నాణేలు లభ్యమయ్యాయి. కోవిలూర్‌లో 3వ రాజరాజచోళుడు నిర్మించిన శివాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో, ప్రస్తుతం ఆలయ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఆలయంలో గర్భగుడి నిర్మాణానికి సోమవారం గుంతలు తవ్వుతున్న సమయంలో ఓ నిధి బయటపడింది. అందులో వంద బంగారు నాణేలు ఉన్నట్లు కార్మికులు గుర్తించారు.



ఈ నాణేలు స్వాధీనం చేసుకున్న అధికారులు వాటిని పరిశీలిస్తున్నారు.

కృష్ణా కాలువలో చెన్నై యువకుడి గల్లంతు



యాసిక్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): కృష్ణా కాలువలో సెల్ఫీ తీసుకునేందుకు యత్నించి గల్లంతైన యువకుడి కోసం అగ్నిమాపక సిబ్బంది సోమవారం కూడా గాలించారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పూండి జలాశయానికి నీరు చేరే కాలువలో వరద ప్రవాహం పెరిగింది. అలాగే, ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాం నుంచి విడుదల చేస్తున్న కృష్ణా జలాలకు వర్షపు నీరు తోడవడంతో ప్రవాహం అధికమైంది. ఈ క్రమంలో, చెన్నై వ్యాసర్పాడికి చెందిన యాసిక్ (22) తన నలుగురు స్నేహితులతో ఆదివారం సాయంత్రం వెళ్లాడు. కృష్ణా జలాలు వెళ్లే కాలువ వద్ద నిలబడి సెల్ఫీ తీసుకుంటున్న యాసిక్ హఠాత్తుగా నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. గమనించిన స్నేహితులు, చుట్టుపక్కల వారు అతడిని రక్షించేందుకు చేసిన యత్నాలు ఫలించలేదు. స్నేహితులు అందించిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని, యాసిక్ కోసం గాలించారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు ఆపివేసిన సిబ్బంది, సోమవారం మధ్యాహ్నం వరకు గాలించినా యాసిక్ ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు.

రైలింజన్‌పై సెల్ఫీ! విద్యార్థి మృతి



మృతుడు అరుణ్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైలింజన్‌పై సెల్ఫీ తీసుకునేందుకు యత్నించిన విద్యార్థి, విద్యుదాఘాతంతో మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తూత్తుకుడి అన్నానగర్‌కు 4వ వీధికి చెందిన అరుణ్ కుమార్ (18) రీల్స్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో, ఆదివారం సాయంత్రం తూత్తుకుడి రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్సు రైలింజన్‌పై ఎక్కిన అరుణ్ సెల్ఫీ తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అతని వెంట ఉన్న స్నేహితులు రాజగోపాలనగర్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి కవిన్ (14), హరీష్ (17)లకు గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని తూత్తుకుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ధర పెరుగుదలతో క్యారెట్ రైతుల హర్షం

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్యారెట్ ధరలు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీలగిరి జిల్లా కొండ ప్రాంతాల్లో రైతులు అధికంగా క్యారెట్ సాగుచేస్తుంటారు. ఈ ప్రాంతంలో పండించే క్యారెట్ చెన్నై, తిరుచ్చి, తిరునల్వేలి జిల్లాల సహా పొరుగు రాష్ట్రాలకు తరలిస్తుంటారు. కొద్దిరోజులుగా క్యారెట్ కిలో రూ.30 ధర పలుకగా, సోమవారం ఒక్కసారిగా రూ.65కు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధికారిపై అసత్య ఆరోపణల కేసులో ఏడాది జైలు

అడయార్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారి గురించి, అసత్య ఆరోపణలు చేసిన వ్యక్తికి ఏడాది జైలుశిక్ష విధించబడింది. 2007-2008 సంవత్సరంలో పూక్కడై పోలీసు స్టేషన్ సీఐగా పనిచేసిన అగస్టీన్‌పాల్ సుధాకర్, ప్రస్తుతం గ్రేటర్ చెన్నై పోలీసు విభాగంలో అడిషినల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆయనపై సిరాజుద్దీన్, నగ్రైముగన్‌లు ఆరోపణలు చేస్తూ కార్టూన్లు విడుదల చేశారు. వీరిపై నమోదైన కేసు జార్జి టౌన్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసు తగిన ఆధారాలతో నిరూపణ కావడంతో, సిరాజుద్దీన్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసు విచారణలో ఉండగా, 2016లో నగ్రైముగన్ మృతిచెందాడు.

రూ.1.61 కోట్లు పన్ను బకాయిలు

● టీ దుకాణం కార్మికుడి దిగ్భ్రాంతి

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీ దుకాణం కార్మికుడు, రూ.1.61 కోట్ల పన్ను బకాయిలు చెల్లించాలంటూ జీఎస్టీ కార్యాలయం నుంచి నోటీసు రావడం అందర్నీ దిగ్భ్రాంతికి గురిచేసింది. తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి పెరియపేటకు చెందిన మహ్మద్ ఫైసన్ (27) టీ దుకాణంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఫైసన్‌కు కొద్దిరోజుల క్రితం చెన్నై జీఎస్టీ కార్యాలయం నుంచి వచ్చిన నోటీసులో... చెన్నైలో 2022 నుంచి ఎస్‌ఆర్‌ఎఫ్ ట్రేడింగ్ పేరుతో తోళ్ల పరిశ్రమలకు యంత్రాల విక్రయం, పర్యవేక్షణకు సంబంధించి జీఎస్టీ చెల్లించని కారణంగా, జరిమానాతో కలిపి కోటి 61 లక్షల 46 వేలు చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ నోటీసుతో దిగ్భ్రాంతి చెందిన ఫైసన్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తన ఆధార్ కార్డు, పాన్ కార్డు ఉపయోగించి తనను వినియోగించుకున్న వారిపై చర్యలు చేపట్టాలని ఫైసన్ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

సైబర్ కేసుల్లో రూ.1.37 కోట్లు స్వాధీనం

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత నెలలో సైబర్ నేరాలకు పాల్పడిన వారి నుంచి రూ.1.37 కోట్లు స్వాధీనం చేసుకుని, బాధితులకు అప్పగించారు. ఈ మేరకు సైబర్ క్రైం విభాగం విడుదల చేసిన ప్రకటనలో... నగరంలోని పోలీస్ స్టేషన్లకు గత నెలలో సైబర్ నేరాలకు సంబంధించి 109 ఫిర్యాదులందాయని తెలిపింది. ఈ ఫిర్యాదులను విచారించి రూ.1.37 కోట్లు స్వాధీనం చేసుకుని, బాధితులకు అందజేశామన్నారు. వీటిలో, కేంద్ర క్రైం పోలీస్ స్టేషన్‌కు అందజేసిన 39 ఫిర్యాదులను విచారించి రూ.66.59 లక్షలు స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. ఈ ఏడాది ఇప్పటివరకు సైబర్ నేరాల్లో కోల్పోయిన రూ.23.03 కోట్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించినట్లు సైబర్ క్రైం తెలియజేసింది.

అవినీతి కప్పిపుచ్చుకునేందుకే 'సర్'ను వ్యతిరేకిస్తున్న డీఎంకే

● కేంద్రమంత్రి ఎల్.మురుగన్

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డీఎంకే పాలనలో గత నాలుగున్నరేళ్లలో అన్ని శాఖలలో అవినీతి అక్రమాలు జరిగాయని, ఆ అవినీతి బండారం బయటపడుతుందనే భయంతోనే సీఎం స్టాలిన్ సహా ఆ పార్టీ నేతలంతా ఓటర్ల జాబితా సవరణ పనులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ విమర్శించారు. చెన్నైలోసోమవారం ఉదయం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ డీఎంకే అవినీతి అక్రమాలు బయటపడే సమయంలో ఏదో ఒక సమస్యను తెరపైకి తెచ్చి అనవసర రాద్ధాంతం చేయడం ఆ పార్టీ నాయకుల ఆనవాయితీ అని ఎద్దేవా చేశారు. ఓటర్ల జాబితాలో నకిలీ ఓటర్ల గుర్తించి తొలగించడం, ఒకే ఓటరు వివిధ ప్రాంతాల్లో పేర్లు నమోదు చేసి ఉంటే ఆ పేర్లను తొలగించడం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన విధి అని, ఈ సవరణలలో ఎప్పుడూ ఎలాంటి అక్రమాలు జరుగవని, ఒకవేళ నిజమైన ఓటర్లను తొలగించి ఉంటే ఆయా ప్రాంతీయ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసుకునే అవకాశం కూడా కల్పిస్తారని ఆయన వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లోగా ఓటర్ల జాబితాలోని నకిలీ ఓటర్లందరినీ తొలగించేస్తారన్న భయం డీఎంకే పట్టుకుందని, ఆ కారణంగానే అనవసరంగా సవరణ పనులపై కోర్టుకు వెళుతోందని మురుగన్ ఆరోపించారు.

255 గ్రాముల గంజాయితో నలుగురి అరెస్ట్

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ థామస్ మౌంట్ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు నలుగురిని అరెస్ట్ చేసి 255 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం సెయింట్ థామస్ మౌంట్ ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా సంచరించిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి బ్యాగులను తనిఖీ చేశారు. వాటిలో 255 గ్రాముల గంజాయి, 3 ఐ ఫోన్లు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుపడిన ఆలందూర్ ప్రాంతానికి చెందిన మనోజ్‌కుమార్ (22), డిసిల్వా (27), మనీష్ చౌదరి (23), ఆనంద్ (29)లను సోమవారం ఉదయం సైదాపేట మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఫ్యాన్సీ స్టోర్ యజమాని ఆత్మహత్య

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ ఫ్యాన్సీ స్టోర్ యజమాని అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కేకేనగర్ మారియమ్మన్ కోవిల్‌వీధికి చెందిన సురేష్ (48) అదే ప్రాంతంలో ఓ ఫ్యాన్సీ స్టోర్ నడుపుతూ ఇంటింటికి పాల ప్యాకెట్లు సరఫరా చేస్తుండేవాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలున్న నేపథ్యంలో, వ్యాపారాన్ని విస్తరింపజేసేందుకు అధికంగా రుణాలు పొందినట్లు తెలిసింది. రుణభారం పెరగడంతో మనస్తాపానికి గురైన సురేష్ సోమవారం తెల్లవారుజామున ఇంట్లో అందరు నిద్రపోతున్న సమయంలో ఫ్యాన్సీ స్టోర్‌కు వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో తెలిసింది. ఇదిలా వుండగా, అప్పుల బాధ భరించలేకే సురేష్ ఈ దారుణానికి పాల్పడ్డాడని సురేష్ కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దుబాయ్ వెళ్లేందుకు నకిలీ వీసా: ఒకరి అరెస్ట్

అడయార్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ వెళ్లేందుకు నకిలీ వీసా తయారుచేసి అందించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పుదుకోట జిల్లాకు చెందిన ఆకాష్ 'ఆన్‌లైన్' ద్వారా పరిచయమైన 'పర్ఫెక్ట్ మ్యాన్ పవర్ కన్సలెంట్' యజమాని చేరలాతన్ (49)ను సంప్రదించి, దుబాయ్ వెళ్లేందుకు వీసా కావాలని కోరాడు. అందుకోసం జూన్‌లో, ఆవడి సింధు నగర్‌లోని చేరలాతన్ కార్యాలయానికి వచ్చి రూ.1.30 లక్షలు అందజేశాడు. అనంతరం చేరలాతన్ 'ఈ-వీసా' ఆకాష్‌కు పంపించాడు. జూలై 10వ తేది ఆకాష్ దుబాయ్ వెళ్లేందుకు మీనంబాక్కంలోని విమానాశ్రయానికి వెళ్లాడు. వీసా పరిశీలించిన అధికారులు, అది నకిలీదని ఆకాష్‌ను వెనక్కి పంపారు. ఈ విషయమై చేరలాతన్‌ను ఆకాష్ ప్రశ్నించగా, డబ్బులు తిరిగిచ్చే ప్రసక్తే లేదంటూ బెదిరించినట్లు సమాచారం. ఈ విషయమై ఆకాష్ ఆవడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టిన పోలీసులు, చేరలాతన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

ఏకాంబరనాథుడి ఆలయంలో బంగారు రథం సిద్ధం



రథానికి తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం ఏకాంబరనాథుడి ఆలయానికి 23 కిలోల బంగారంతో, 23 అడుగుల ఎత్తున బంగారు రథం పనులు తుదిదశకు చేరుకున్న సమయంలో, త్వరలో ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఏకాంబరనాథుడి ఆలయంలో రూ.29 కోట్ల తో జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు ముగించి డిసెంబరు 8వ తేది మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఆలయానికి బంగారు రథం చేయించాలనే భక్తుల కోరిక మేరకు, 12 ఏళ్లుగా రథం తయారీ పనులు ప్రారంభించగా, పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. అనంతరం కంచి పీఠాధిపతి విజయేంద్ర కృషితో, ఏకాంబర ఆలయ సేవా ట్రస్ట్ ఏర్పాటుచేసి, బంగారు రథం తయారీపనులు ప్రారంభించి, రెండేళ్లుగా కొనసాగుతున్నాయి. సుమారు 40 మంది శిల్ప కళాకారులు రథం తయారీ పనుల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. 23 అడుగుల ఎత్తు, 15 అడుగుల పొడవు, 13 అడుగుల వెడల్పుతో కలిగిన ఈ రథానికి 23 కిలోల బంగారం వినియోగించారు. మహాస్వామిగళ్ మండపంలో రథానికి బంగారు రేకులు అమరుస్తున్నారు. ఈ రథాన్ని అత్యంత భద్రత మధ్య ఉంచేలా రూ.18 లక్షలతో ప్రత్యేక మండపం పనులు పూర్తయ్యాయి. త్వరలో ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.